సాక్షి జగిత్యాల

శనివారం । 6 । మే । 2023



కల్యాణం.. కమనీయం

రాయికల్ : భూపతిపూర్, మూటపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. ప్రముఖులు హాజరయ్యారు.



నృసింహుని జాతర

కథలాపూర్ : దుంపేట శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రముఖులు, భక్తులు హాజరయ్యారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/24.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీరప్ప ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు



పూజలు చేస్తున్న జడ్జి కార్తీక్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని బీరప్ప ఆలయంలో కామరావతి కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. గొర్రెపాలు, నెయ్యితో స్వామివారికి అభిషేకం చేశారు. హైకోర్టు జడ్జి పుల్ల కార్తీక్ ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పుల్ల మహేశ్, మల్లారెడ్డి, దయాల శంకర్, కమ్ము హరీశ్, అంజయ్య పాల్గొన్నారు.

మూడు సర్వేలు ఎందుకు?



జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

జగిత్యాలరూరల్: జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణం కోసం మూడు సర్వేలు ఎందుకు చేశారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. జాతీయ రహదారి కోసం భూములు కోల్పోయే పలువురు రైతులు శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, అధికారులు రోడ్డు అలైన్‌మెంట్ ఎందుకు మార్చారని నిలదీశారు. ప్రభుత్వ భూముల వెంట జాతీయ రహదారి బైపాస్‌రోడ్డు ప్రతిపాదించాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులకు నష్టం కలిగే అలైన్‌మెంట్‌ను మార్చాలని చెప్పారు. ఈ విషయంపై ఇప్పటికే ఎంపీ అర్వింద్‌కు లేఖ రాశానని గుర్తుచేశారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డీఎల్‌పీవో శంకర్

కథలాపూర్(వేములవాడ): గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం చేయొద్దని కోరుట్ల డీఎల్‌పీవో శంకర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగునీటి కాలువల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గంగాధర్ పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని కల్యాణం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

పెగడపల్లి(ధర్మపురి): స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. తొలుత స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి కల్యాణ వేదికకు తీసుకొచ్చారు. అనంతరం అర్చకుడు గుండి వినయ్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిపించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పడకేసిన ఫాగింగ్..!

- అకాల వర్షాలతో పారిశుధ్యం అస్తవ్యస్తం
- విజృంభిస్తున్న దోమలు.. వ్యాధుల బారిన ప్రజలు
- మున్సిపాలిటీల్లో సరిపోని ఫాగింగ్ మిషన్‌లు



జగిత్యాలలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

జగిత్యాల: కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పులు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు రావడంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఎండాకాలం అయినా వారం రోజులుగా వర్షాలు కురవడం.. మురుగునీటి కాలువలు పొంగిపొర్లడంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. దోమలు విపరీతంగా వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. వాటి నివారణకు ఫాగింగ్ చేయడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతీ మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలో పారిశుధ్యం సక్రమంగా చేపట్టాలి, ఫాగింగ్ చేయాలి, ఆయిల్ బాల్స్ వేయాలని ప్రతీ సమావేశంలో కలెక్టర్ అధికారులను ఆదేశిస్తున్నా ఆశించిన స్థాయిలో పారిశుధ్యం మెరుగుపడడం లేదు. జిల్లాలోని మున్సిపాలిటీల విస్తీర్ణం పెద్దగా ఉండి, ఫాగింగ్ మిషన్లు తక్కువగా ఉండటంతో ఎక్కడ కూడా ఫాగింగ్ చేయడం లేదు. పట్టణాల్లో రోజూ ఆటోల్లో రోడ్లపై నేరుగా ఫాగింగ్ చేసేవారు. ప్రస్తుతం మచ్చుకు కూడా కనిపించడం లేదు.

సరిపోని మిషన్లు

- జిల్లాలో పెద్ద మున్సిపాలిటీలు జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఉండగా రాయికల్, ధర్మపురి చిన్న బల్దియాలు. ఆయా మున్సిపాలిటీల్లోని వార్డుల్లో రోజూ సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్ చేస్తుంటారు.
- కానీ వార్డులకు కావాల్సినన్ని ఫాగింగ్ మిషన్లు లేక పరిస్థితి దారుణంగా ఉంది. సాయంత్రం దోమలు విపరీతంగా వస్తున్నాయని, ఇళ్లలో తాము ఉండలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- జగిత్యాలలో 48 వార్డులు ఉండగా కేవలం 4 ఫాగింగ్ మిషన్లు మాత్రమే ఉన్నాయి. అందులో రెండు మూలకు పడగా, మరో రెండు సక్రమంగా పనిచేయడం లేదు. కనీసం వార్డుకు ఒకరోజు చొప్పున ఫాగింగ్ చేద్దామన్నా మొత్తం వార్డులకు వచ్చేసరికి సుమారు నెల రోజుల పైనే పడుతోంది.
- అలాగే కోరుట్లలో 33 వార్డులుండగా అక్కడ 4 ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. అవి పూర్తిస్థాయిలో పనిచేస్తున్నా అన్ని వార్డులకు ఫాగింగ్ చేయలేకపోతున్నారు.
- మెట్‌పల్లిలో 26 వార్డులకు 2 మిషన్లు ఉండగా అందులో ఒకటే పనిచేస్తోంది. ఇక్కడ సైతం వార్డులకు ఫాగింగ్ చేయడం సరిపోవడం లేదు. ఇక ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో ఒక్కొక్కటి ఉండగా వాటిని వినియోగించడం లేదు.

కొన్నవి మూలకు..

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతోంది. జనాభా పెరగడం, కొన్ని వార్డులు విలీనం అయినా కావాల్సినన్ని ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేయడం లేదు. జగిత్యాల మున్సిపల్‌లో రెండేళ్ల క్రితం రూ.6.05 లక్షలతో రెండు మిషన్లను కొనుగోలు చేయగా వాటిని మూలనపడేశారు. కొత్త మిషన్లు అయినా వాటిని వినియోగించడం లేదు. మిషన్లు చెడిపోతే మరమ్మతులు చేసే అవకాశం ఇక్కడ లేకపోవడంతో కరీంనగర్, హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. అలాగే మున్సిపాలిటీ సాధారణ బడ్జెట్ నుంచి కొనుగోలు చేసే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కాగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జాలీలు కొనుగోలు చేసి సెప్టిక్ ట్యాంకు పైప్‌లకు ఏర్పాటు చేయాల్సి ఉండగా అవి మచ్చుకు సైతం కనిపించడం లేదు.

మున్సిపాలిటీ	జగిత్యాల	కోరుట్ల	మెట్‌పల్లి	రాయికల్	ధర్మపురి
వార్డులు	48	33	26	12	15
ఫాగింగ్ వాహనాలు	4	4	2	1	1
పనిచేస్తున్నవి	2	4	1	1	1
మరమ్మతుల్లో ఉన్నవి	2	0	1	1	0

చర్యలు తీసుకుంటున్నాం



జగిత్యాల మున్సిపాలిటీలో ఫాగింగ్ చేస్తున్నాం. 4 మిషన్లు ఉండగా ఇటీవల రెండు మరమ్మతులకు గురికాగా వాటిని కూడా మరమ్మతు చేయిస్తున్నాం. ప్రతీ వార్డులో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దోమలు ఎక్కువగా ఉన్నచోట మొదట ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

హనుమాన్ జయంతికి పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, వేదికపై చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎస్పీ భాస్కర్

- ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లతో ఏర్పాట్లపై శుక్రవారం సమీక్షించారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. వేసవి సెలవులు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మహిళలు, వృద్ధులు, పిల్లలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, రెడ్‌క్రాస్ సొసైటీ, సత్యసాయి ట్రస్ట్‌తోపాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సేవలను ఉత్సవాల్లో వినియోగించాలని అన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రతీ అర్ధకిలోమీటరుకు ఒక చలివేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఇప్పటివరకు జేఎన్‌టీయూ రోడ్డు, బొజ్జపోతన్న, అనంతరెడ్డి భూమి, గుట్టపక్కన వై జంక్షన్, ఐకేపీ సెంటర్, బొజ్జపోతన్న ప్రైవేటు స్థలం, కొండాల్‌రావు స్థలాల్లో పార్కింగ్ పాయింట్‌లు గుర్తించామని తెలిపారు. కోనేరులో నీటిని నింపి, 120 షవర్లు ఏర్పాటు చేయాలన్నారు. 76 శాశ్వత, 58 తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించామని అన్నారు. జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఆలయంలో 10, బయట 64 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని అన్నారు. మెడికల్ హెల్త్ క్యాంప్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో రేడియం స్టిప్స్ వేయించాలన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, ఉత్సవాల సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ, గతంలో కరోనాతో ఉత్సవాలు నిర్వహించలేకపోయామని, ఈసారి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. చేయాలన్నారు. వలంటీర్లకు వాకీటాకీలు ఇవ్వాలని కోరారు. అదనపు కలెక్టర్ మకరంద్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయండి

- డీఆర్డీవో లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సారంగాపూర్(జగిత్యాల): అకాల వర్షాలతో తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని, తూకం పూర్తయ్యాక రైస్‌మిల్లులకు తక్షణమే తరలించాలని డీఆర్డీవో లక్ష్మీనారాయణ ఆదేశించారు. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దన్నారు. పెంబట్ల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో సెర్ప్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ధాన్యం కుప్పలు తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. తడిసిన, రంగు మారిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. నిర్దేశిత తేమశాతం రాగానే తూకం వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. మిల్లర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్పంచులు బొడ్డుపల్లి రాజన్న, పొంపర్తి లక్ష్మి, ఏపీఎం రాజయ్య, రైతులు, నిర్వాహకులు ఉన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో హరితహారం, పచ్చదనం, పరిశుభ్రతపై ఆయన సమీక్షించారు. మహిళా సంఘాలను భాగస్వామ్యులను చేయాలని సూచించారు. ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో శశికుమార్‌రెడ్డి ఉన్నారు.

పదోన్నతుల ‘పంచాయితీ’

- పంచాయతీ రాజ్ విభాగంలో వింత పరిస్థితి
- పదోన్నతి కోసం 84 మంది జూనియర్ అసిస్టెంట్ల ఎదురుచూపులు
- గతేడాది డిసెంబర్‌లోనే సీనియారిటీకి అర్హత
- ఆరునెలలుగా కాలయాపన చేస్తున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం పదోన్నతుల పంచాయితీ నడుస్తోంది. పంచాయతీరాజ్ విభాగంలో రెండేళ్ల కింద చేరిన జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతికి అర్హత సాధించి దాదాపు ఆరునెలలు కావస్తున్నా.. వారికి ప్రమోషన్ రావడం లేదు. సర్వీస్ రూల్స్ ప్రకారం.. తమకు పదోన్నతి రాకుండా ఉన్నతాధికారులు ఆపేస్తున్నారని జూనియర్ అసిస్టెంట్లు ఆరోపిస్తుండగా.. అందరికీ ఒకేసారి ఇద్దామన్న ఆలోచనతో ఉన్నామంటూ ఉన్నతాధికారులు తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. దీంతో ఈ వివాదం క్రమంగా చినికి చినికి గాలివానగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తమ పదోన్నతులను కావాలనే ఆపుతున్నారన్న భావన ప్రతీ జూనియర్ అసిస్టెంట్లలో క్రమంగా నాటుకుపోతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లు తమ ఉన్నతాధికారులతో పలుచోట్ల ఘర్షణలకు దిగుతున్నారు.

అసలేం జరిగింది?

2018 జూన్‌లో టీఎస్‌పీఎస్సీ ద్వారా దాదాపు 1,500కుపైగా పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. అందులో దాదాపు 160 వరకు పంచాయతీరాజ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కూడా ఉన్నాయి. అదే ఏడాది ఆగస్టులో అభ్యర్థులంతా టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్ష రాశారు. 2020 అక్టోబరులో ఫలితాలు విడుదలయ్యాయి. అదే ఏడాది డిసెంబరులో వీరంతా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్లుగా పంచాయతీరాజ్ కార్యాలయాల్లో విధుల్లో చేరారు. ఇందులో వరంగల్ రీజియన్(కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్)లో దాదాపు 84 మందికిపైగా ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 20 మందికిపైగా పనిచేస్తున్నారు. వాస్తవానికి వీరికి గత డిసెంబరులో సర్వీసు రూల్స్ ప్రకారం.. సీనియర్ అసిస్టెంట్ లేదా యూడీసీగా పదోన్నతి రావాలి. కానీ.. అధికారులు ఆ ఫైళ్లను తమ వద్దే పెట్టుకున్నారు. ఆరునెలలుగా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు.

కారణాలివే..?

ఈ విషయంలో ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాలతోపాటు మిగిలిన పాత ఖమ్మం ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలోనూ జూనియర్ అసిస్టెంట్లు తీవ్ర ఆవేదనలో కూరుకుపోయారు. ఇదే విషయమై తమ ఉన్నతాధికారులతో వాదోపవాదాలకు దిగుతున్నారు. దీంతో కొందరు డిప్యుటేషన్ కోసం ప్రయతిస్తున్నారు. మరికొందరు తమ పదోన్నతులు ఆపారంటూ కొందరు మంత్రులకు మొరపెట్టుకుంటున్నారు. దీనికి అధికారులు ఏం చెబుతున్నారంటే.. ఇటీవల గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల నేపథ్యంలో కొందరు, గర్భం దాల్చిన కారణంగా కొందరు మహిళా సిబ్బంది రెండు నుంచి ఆరునెలల వరకు అధికారికంగా లీవు పెట్టారు. కొన్ని నెలలపాటు సర్వీసులో వెనకబడిన కారణంగా తాము మిగిలిన వారికి పదోన్నతులు ఇవ్వలేకపోతున్నామని, అందరికీ రెండేళ్లునిండిన వెంటనే పదోన్నతులు ఇస్తామని అధికారులు జూనియర్ అసిస్టెంట్లకు వివరణ ఇస్తున్నారు. అయితే.. వీరంతా డిసెంబరు నాటికి విధుల్లో చేరిపోయారు. ఈ లెక్కన ఇప్పటికే ఆరునెలలు కావస్తోంది. అధికారులు చెప్పిన ప్రకారం.. ఇప్పుడు అందరికి రెండేళ్ల సర్వీసు నిండినట్లే. అయినా.. ఎందుకు ఇవ్వడం లేదని జూనియర్ అసిస్టెంట్లు మదనపడిపోతున్నారు. అధికారులు సర్వీసు రూల్స్‌ను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

క్రమబద్ధీకరణలో ‘సహకారం’!

- సిబ్బంది నుంచి దాదాపు రూ.1.18 కోట్ల వసూలు
- రెండు దశాబ్దాల కల కోసం కప్పం కట్టిన ఉద్యోగులు
- సచివాలయానికి చేరిన మామూళ్ల పర్వం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఇటీవల ఉమ్మడి జిల్లా కరీంనగర్ జిల్లాలో ఓ శాఖలో ఉద్యోగుల క్రమబద్ధీకరణలో భారీగా డబ్బులు చేతులు మారాయి. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఉదంతం కలకలం రేపుతోంది. ఉద్యోగుల క్రమబద్ధీకరణ పేరిట జరిగిన ఈ వసూళ్ల పర్వం విలువ దాదాపు రూ.2 కోట్లకు చేరడంతో సదరు ప్రభుత్వశాఖలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. సదరుశాఖలో ఇటీవల దాదాపు 591పోస్టులు రెగ్యులరైజ్ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందులో కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ మరో రెండు రకాల పోస్టులు ఉన్నాయి. ఈ ఉద్యోగులంతా దాదాపు 20ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. చాలాకాలంగా ఎదురుచూస్తున్న క్రమబద్ధీకరణకు ఇటీవల అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

సంబరాన్ని సొమ్ము చేసుకున్నారు

ఈ విషయంపై ఉన్నతాధికారుల నుంచి ఉద్యోగులకు ముందే సమాచారం అందింది. దాదాపుగా రెండు దశాబ్దాలుగా కొలువుల క్రమబద్ధీకరణకు తమ నిరీక్షణ ఫలించడంతో అంతా కలిసి సంబరాలు చేసుకున్నారు. జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలపరిధిలో మొత్తం 591 ఉద్యోగుల క్రమబద్ధీకరణకు అంతా సిద్ధమైంది. సరిగ్గా అప్పుడే.. ఉన్నతాధికారుల అనుచరులు రంగంలోకి దిగారు. 591 కుటుంబాలకు ఈ నిర్ణయం మేలు చేస్తుందని, కాబట్టి ఉన్నతాధికారులకు ప్రతీ ఉద్యోగికి రూ.20వేల చొప్పున మామూళ్లు ఇవ్వాల్సిందేనని సందేశం పంపారు. 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిర్ణయం అమలు కానుందన్న ఆనందంలో చాలామంది ఉద్యోగులు అప్పోసప్పో చేసి అనుచరులు అడిగినకాడికి సమర్పించుకున్నారు. రూ.1.18 కోట్లు వసూలు చేశారు.

ఆగమేఘాల మీద ప్రొసీడింగ్స్

సదరుశాఖలో వసూళ్ల పర్వం పూర్తికాగానే క్రమబద్ధీకరణ పర్వం మొదలైంది. మొత్తం 591 ఉద్యోగాలకు క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్స్‌తోపాటు, తీర్మానాలు అవసరం. ఇక్కడే అనుచరులు చక్రం తిప్పారు. తీర్మానాల విషయంలో వయసు పైబడిన వాళ్లు, అనర్హతలు కలిగిన వారివద్ద రూ.50వేలకు పైగానే వసూలు చేశారని సమాచారం. ఆగమేఘాల మీద 591 మందికి రెగ్యులరైజేషన్ జరిగిపోయింది. వసూళ్ల పర్వం సదరుశాఖలో చర్చనీయాంశంగా మారడంతో ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా హైదరాబాద్‌లోని సచివాలయానికి చేరింది. సదరు విభాగంలో ఉన్నతాధికారి ఈ మొత్తం వ్యవహారంలో సూత్రధారిగా వ్యవహరించారని తెలిసింది. సదరుశాఖ కమిషనర్‌కు విషయం తెలిసి విచారణకు ఆదేశించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.

తడిసిన ధాన్యం.. అన్నదాత దైన్యం

- మళ్లీ వర్షం.. వర్షపునీటిలో వడ్లు



ధాన్యం కుప్పల్లోంచి నీటిని తొలగిస్తున్న రైతులు

ధర్మపురి: మొన్నటిదాకా ఏకధాటిగా కురిసిన వర్షంతో అతలాకుతలమైన అన్నదాత గురువారం కాస్త ఊపిరి పీల్చుకున్నాడు. అప్పటిదాకా తడిసి ధాన్యం ఆరబెట్టి నిర్దేశిత 17శాతం తేమ వచ్చేలా అరిగోసపడ్డాడు. తేమ రావడంతో నిర్వాహకులు కొనుగోలు చేస్తారని ఆశపడ్డారు. కానీ, వారి ఆశలు అడియాసలయ్యాయి. శుక్రవారం మరోసారి భారీవర్షం కురవడంతో తేమశాతం వచ్చిన ధాన్యం మొత్తం తడిసి ముద్దయ్యింది. ధర్మపురి, జైనా, దొంతాపూర్, రాయపట్నం, నేరెళ్ల తదితర గ్రామాల్లో కురిసిన అకాల వర్షంతో విక్రయానికి సిద్ధంగా ఉంచిన వందలాది క్వింటాళ్ల వడ్లు తడిసి ముద్దయ్యాయి. కారుమబ్బులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలతో చేతికందిన పంట నీటి పాలైందని అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.

మా బాధలు ఎవరికీ పట్టవా?

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మేం పడుతున్న బాధలు ఎవరికీ పట్టడం లేదు. ఒకవైపు వర్షం కురుస్తున్నా.. అనేక కష్టాలకు ఓర్చి మరోవైపు వడ్లు తేమవచ్చేలా పాట్లు పడుతున్నం. అయినా, నిర్వాహకులు వడ్లు కొనుగోలు చేయడం లేదు. శుక్రవారం కురిసిన వర్షంతో తేమవచ్చిన వడ్లు మళ్లీ తడిసినయి. కొన్ని వడ్లు వర్షపునీటిలో కొట్టుకుపోయినయి. పదిరోజులుగా ఇదే గోస.

– లక్ష్మీనారాయణ, రైతు, ధర్మపురి

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి..

- అకాల వర్షాలకు తడిసిన ధాన్యం మొలకలు వస్తాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.
- ఇప్పటికే సుమారు పదిరోజులుగా వడ్లను అతిజాగ్రత్తగా ఆరబెడుతున్నామని, శుక్రవారం కురిసిన అకాల వర్షం మళ్లీ వర్షంలో ముంచిందని అన్నదాతలు ఆవేదన చెందారు.
- రాయపట్నంలో ధాన్యం బురదపాలైంది.
- ధర్మపురి మార్కెట్‌యార్డులోని ధాన్యం నీటిపాలైంది.
- నీరు మళ్లించడానికి రైతులు పడరానిపాట్లు పడ్డారు.
- అధికారులు ఇచ్చిన పాలిథిన్ కవర్లు రంధ్రాలు పడి వర్షపునీటిలో ధాన్యం తడిసిందని ధర్మపురికి చెందిన రైతు శంకర్ ఆవేదన వ్యక్తం చేశాడు.
- 17 శాతం తేమ వచ్చిన వడ్లను కూడా కొనుగోలు చేయడం లేదని మరో రైతు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.
- తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. ఆచరణలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

- ఎనిమిదో రోజుకు చేరిన సమ్మె



గొల్లపల్లిలో నిరసన తెలుపుతున్న చిన్నారి

జగిత్యాలరూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎనిమిదోరోజు తమ కుటుంబ సభ్యులతో కలిసి నిరసనయ తెలిపారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి వారికి మద్దతు ప్రకటించారు. నాయకులు రాజిరెడ్డి, వనజ, సంతోష్, మహేశ్, శ్రీనివాస్, స్వప్న, స్రవంతి పాల్గొన్నారు.

చిన్న పిల్లలతో నిరసన

గొల్లపల్లి(ధర్మపురి): జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ముగ్గులు వేసి ప్రభుత్వ తీరుపై బతుకమ్మ ఆడి తమ కుటుంబ సభ్యులు, చిన్నపిల్లలతో కలిసి నిరసన తెలిపారు. ‘కేసీఆర్ తాత.. భద్రత ఇవ్వండి మా నాన్న ఉద్యోగానికి.. మా కుటుంబానికి’ అంటూ ఓ చిన్నారి ప్లకార్డు ప్రదర్శించింది.

క్లుప్తంగా

ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రెండు దశాబ్దాలుగా ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న లెక్చరర్ల కల ఫలించింది. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన మేరకు టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన సుమారు తొమ్మిదిఏళ్లకు ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణకు పచ్చజెండా ఊపింది. ఉమ్మడిజిల్లాలో 58ప్రభుత్వ కళాశాలల్లో 514 మంది కల ఫలించింది. శుక్రవారం ఆకస్మికంగా కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని అన్నిజిల్లాల్లోని డీఐఈవోలను ప్రభుత్వం ఆదేశించింది. ఫలితంగా ఆయా కార్యాలయాల నుంచి అందిన సమాచారం మేరకు తమ ఉత్తర్వులను అందుకునేందుకు కాంట్రాక్ట్ లెక్చరర్లు డీఐఈవో ఆఫీసుల ఎదుట సందడి చేశారు. అధికారిక ఉత్తర్వులు అందుకోవడంతో హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి శిక్షణ శిబిరానికి ఎంపిక

జగిత్యాల: జాతీయస్థాయి బాక్సింగ్ శిక్షణ శిబిరానికి జిల్లాలోని గొల్లపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన పాదం మహేందర్ ఎంపికయ్యాడు. ఈనెల 8 నుంచి 45 రోజుల పాటు జరిగే బాక్సింగ్ శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొంటాడు. పంజాబ్ రాష్ట్రం పటియాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఎస్ఏఐ పర్యవేక్షణలో శిక్షణ శిబిరం నిర్వహిస్తారు. మహేందర్ సీఐఎస్ఎఫ్‌లో జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనను మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ అభినందించారు.

ఉత్తమ మార్గమే విజయానికి సోపానం

కోరుట్ల : ఉత్తమ మార్గామే విజయానికి సోపానమని నేను సైతం సమాజం కోసం స్థాపకుడు మాస్టర్ మోటివేటర్ బ్రదర్ షఫీ అన్నారు. పట్టణంలో ఈద్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన ఇహ పర లోకాల సాఫల్యం అనే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ జీవితంలో ఎన్నో విజయాలు సాధించాలనుకుంటారన్నారు.

వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం : జగిత్యాల అర్బన్ మండలం.. తిప్పన్నపేటకు చెందిన జక్కుల బాలరాజు ఇంట్లో చొరబడి డోర్స్, వస్తువులను పగులగొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. తిప్పన్నపేటకు చెందిన జక్కుల బాలరాజుకు అదే గ్రామానికి చెందిన నలువాల తులసికి గురువారం సాయంత్రం ఇంటి బావి మోటార్ విషయంలో గొడవ జరిగింది. దీంతో తులసి బాలరాజుపై దాడి చేయడంతో పాటు ఇంట్లోని డోర్లను పగులగొట్టి వస్తువులను ధ్వంసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తులసిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన మానాల అనిత అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు. గ్రామానికి చెందిన ఉప్పారపు లక్ష్మీ కుమార్తె అనిత భర్తతో మనస్పర్థలు రావడంతో తల్లిగారి ఊరైన నర్సింగాపూర్‌లో ఉంటోంది. గురువారం మధ్యాహ్నం బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించ లేదు. దీంతో తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామానికి మృతదేహం

మేడిపెల్లి : బీమారం మండలం.. లింగంపేట్ గ్రామానికి చెందిన రాణవేణి గంగాధర్(45) ఇటీవల గుండెపోటుతో దుబాయిలో మృతిచెందగా శుక్రవారం స్వగ్రామానికి మృతదేహం చేరింది. కుటుంబ సభ్యులు, గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని గల్ఫ్ జేఏసీ నాయకులు గుగ్గిల్ల రవి డిమాండ్ చేశారు.

‘ఉపాధి’ పనిదినాలు ఖరారు



గోవిందుపల్లి చెరువులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

- 2023–24లో ఉపాధి కూలీలకు పనిదినాల నిర్దేశం
- మొత్తం 46.35 లక్షలు లక్ష్యం
- నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం
- మొత్తం జాబ్‌కార్డులు 1.66 లక్షలు
- కూలీలు 2.71 లక్షలు

గొల్లపల్లి: జిల్లాలో గతేడాది ఉపాధిహామీ పథకం కింద పనుల లక్ష్యం నెరవేరింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను కూలీలకు కల్పించాల్సిన పనిదినాల వార్షిక ప్రణాళికను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఖరారు చేశారు. గత అక్టోబర్‌లో క్షేత్రస్థాయిలో సిబ్బంది పనులను గుర్తించి, గ్రామ సభల్లో తీర్మానాలు చేశారు. నీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల్లో వలసలు పూర్తిగా నిరోధించి కూలీలకు పకడ్బందీ పనులు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రణాళిక ఆధారంగా కొద్దిరోజుల క్రితం ఉపాధిహామీ కింద చేపట్టాల్సిన పనులు, పనిదినాలు ఖరారు చేశారు.

పనులు ఇవే..

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కింద ప్రతి ఆర్థిక సంవత్సరానికి ముందుగానే చేపట్టాల్సిన పనులను గుర్తిస్తారు. ఈ ఏడాది ఉన్నతాధికారుల సూచన మేరకు శాశ్వత పనులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ప్రధానంగా నీటి సంరక్షణ పనులకు(పాంపోడ్స్, బావుల పూడిక తీత, వాలు కట్టలు) ప్రాధాన్యత కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఇంకుడుగుంతలు, వ్యవసాయ పొలాల చదును, కంపోస్టు పిట్‌లు, నాడెక్ కంపోస్టు పిట్‌లు, పండ్లతోటలు, పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, పాఠశాలల్లో టాయిలెట్లు, నర్సరీలు, వంటగదులు, తదితర పనులు ఇందులో ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని గ్రామసభల ద్వారా అక్కడ చేయాల్సిన పనులు, కూలీల డిమాండ్‌ను పరిగణలోకి తీసుకున్నారు.

46.35 లక్షల పనిదినాలు..

గుర్తించిన పనులకు అవసరమయ్యే పనిదినాల సంఖ్య, బడ్జెట్‌ను (కూలీల వేతనాలు, మెటీరియల్‌కు అయ్యే వ్యయం)పంచాయతీల వారీగా అంచనా వేసి రికార్డుల్లో వివరాలు నమోదు చేశారు. ఈ వివరాలను మండలాల వారీగా క్రోడీకరించి పోర్టల్‌లో పొందుపరిచి ప్రభుత్వానికి నివేదించారు. గుర్తించిన పనులకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించడంతో ఉపాధి పనులకు గుర్తింపు, పనిదినాల సంఖ్య ఖరారైంది. 46,35,386 పని దినాలను లక్ష్యంగా నిర్దేశించారు.

కూలీల అనాసక్తి...

ఉపాధిహామీ కింద గత 2022–23 సంవత్సరం 26,62,571 పనిదినాలు కల్పించారు. పనుల లక్ష్యం నెరవేరడంతో పాటు అదనంగా 5,63,084 లక్షల పనిదినాలు చేశారు. మొత్తం 32,25,655 పనిదినాలు పూర్తిచేశారు. దీంతో రెట్టింపు ఉత్సాహంతో ఈ ఏడాది పనులు కల్పిస్తున్నా కూలీలు ఆశించిన స్థాయిలో రావడం లేదు. ఉపాధి పనులు చేపట్టిన కూలీలకు వేతనాలు సకాలంలో అందడం లేదు. వారానికోసారి వేతనాలు అందితేనే కుటుంబాలను పోషించుకునే పరిస్థితి. ఒకరోజు ఉపాధిహామీ కూలీకి వెళ్తే రూ.272 రాగా ఇతర కూలీ పనులకు వెళ్తే రూ.400 నుంచి రూ.500 వరకు వస్తోంది. దీంతో కూలీలు ఉపాధి పనుల పట్ల ఆసక్తి చూపడం లేదు. ఫిబ్రవరి నుంచి మేనెల వరకు రెగ్యులర్ వేతనంతో పాటు, వేసవి అదనపు భత్యం అందించేవారు. రెండేళ్ల నుంచి ఈ అదనపు భత్యం ఇవ్వకపోవడంతో ఏప్రిల్, మే నెలల్లో కూలీలు ఉపాధి పనులకు కాకుండా ఇతర పనులకు వెళ్తున్నారు.

2023-24 పనిదినాల లక్ష్యం మండలాల వారీగా..

మండలం	పనిదినాలు (లక్షల్లో)
బీర్‌పూర్	1,74,364
బుగ్గారం	1,58,168
ధర్మపురి	4,14,725
గొల్లపల్లి	3,54,759
ఇబ్రహీంపట్నం	1,97,801
జగిత్యాల	2,00,700
జగిత్యాల రూరల్	2,98,131
కథలాపూర్	2,07,366
కొడిమ్యాల	4,06,382
కోరుట్ల	1,96,820
మల్లాపూర్	2,40,271
మల్యాల	2,60,464
మేడిపల్లి	3,25,403
మెట్‌పల్లి	2,50,609
పెగడపల్లి	2,40,283
రాయికల్	3,57,158
సారంగపూర్	2,38,686
వెల్గటూర్	2,93,296

ప్రతికూలీకి పని కల్పిస్తాం



2023–24 సంవత్సరం ఉపాధిహామీ కింద చేపట్టాల్సిన పనులను ముందస్తుగా గుర్తించి పనిదినాలు ఖరారు చేశాం. ప్రతి కూలీకి పనికల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. గతేడాది లక్ష్యం కంటే 5 లక్షలకు పైగా పనిదినాలను అధికంగా చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంమేరకు పనిదినాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం.

– డీఆర్డీఏ పీడీ లక్ష్మి నారాయణ

‘టీఎస్‌ఆర్‌జేసీ’ సజావుగా నిర్వహించాలి

- పరీక్షకు హాజరుకానున్న 7,081 మంది విద్యార్థులు
- ఉమ్మడి జిల్లాలో 30 కేంద్రాలు
- జాయింట్ కలెక్టర్(శిక్షణ) నవీన్ నికోలస్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్ నికోలస్

కరీంనగర్: ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశంకోసం శనివారం ×టీఎస్ఆర్‌జేసీ¤ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ (శిక్షణ) నవీన్ నికోలస్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఆడిటోరియంలో పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు నిర్వహించే పరీక్షకు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షకు 7,081 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, ఎంపీసీ 4,767, బైపీసీ 2,136, ఎంఈసీలో 178 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు 30 కేంద్రాల్లో 30మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 5 రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కో–ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, డీఈవో జనార్దన్ రావు, సూపరింటెండెంట్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

- సాయిబాబా ఆలయంలో పూజలు

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమ స్థాపనకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిపై అక్రమంగా నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని స్తంభంపల్లి, పాశిగామ గ్రామాలకు చెందిన సుమారు 300 మంది కర్మాగారం ప్రతిపాదిత స్థలంలో శుక్రవారం నిరసన తెలియజేశారు. బుద్ధ పౌర్ణమి సందర్భంగా పరిశ్రమ ప్రతిపాదిత స్థలంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే భూమి పూజచేసిన స్థలంలో సుమారు మూడు గంటల పాటు నిరసన తెలిపారు. బుద్ధుని ఆనవాళ్లు ఉన్న చారిత్రక ప్రదేశాన్ని కాపాడుకోవాలని, భవిష్యత్‌లో ఈ ప్రాంతం గొప్ప పర్యాటక కేంద్రంగా విలసిల్లాలని ఆకాంక్షించారు. ఇథనాల్ పరిశ్రమ రద్దు చేయాలని పోరాటం చేస్తున్న రెండు గ్రామాల యువకులపై అక్రమంగా కేసులు నమోదు చేసి అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తాము భవిష్యత్ తరాల బతుకు దెరువు కోసం ఉద్యమిస్తున్నామని, పోలీసులు తమపై అక్రమంగా కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. కేసులను రద్దు చేయాలని, లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈనెల 8న కలెక్టర్ ఇక్కడ పర్యటిస్తారని, ఏవైనా అనుమానాలు, అభ్యంతరాలు చెప్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారని ఎస్సై గ్రామస్తులకు నచ్చజెప్పగా ఆందోళన విరమించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



హబ్సీపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల రూరల్ : గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హబ్సీపూర్ నుంచి వైకుంఠధామం వరకు రూ.60 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణం, రూ.19 ఎఫ్‌డీఆర్ నిధులతో వాటర్ ట్యాంక్ నుంచి డీ–53 కెనాల్ వరకు కల్వర్టు నిర్మాణానికి, రూ.3 లక్షలతో నిర్మించే ఎస్సీ సంఘ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ చెవుల లక్ష్మీ, ఎంపీడీవో రాజేశ్వరి, డీఈ మలింద్, ఏఈ రాజమల్లయ్య, నాయకులు బాలముకుందం, ఎల్లారెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రత్యేక నిధులు..

నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. పొలాస గ్రామం నుంచి పొలస్తేశ్వరస్వామి ఆలయం వరకు రూ.34 లక్షలతో నిర్మించే రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన నలుగురికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ రాజేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, రైతుబంధు కన్వీనర్ నక్కల రవీందర్ రెడ్డి, నాయకులు నరేశ్, పోచమల్లు, సురేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి

- తెలంగాణ జనసమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న కంతి మోహన్‌రెడ్డి

మల్లాపూర్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ జనసమితి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంతి మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఎనిమిదో రోజుకు చేరింది. తెలంగాణ జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్కా కమలాకర్‌తో కలిసి జేపీఎస్‌లకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేపీఎస్‌లకు ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయకపోవడంతోనే సమ్మెబాట పట్టారని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ, పారిశుధ్య పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. తెలంగాణ జనసమితి మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు పసునూరి శ్రీనివాస్, యువజన సమితి జిల్లా నాయకులు వన్నెల శశి, బొడ్డు సుధాకర్, పర్రె శంకర్, తరుణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు అండగా ఉంటాం

ఇబ్రహీంపట్నం : జూనియర్ పంచాయతి కార్యదర్శుల డిమాండ్లను సీఎం కేసీఆర్ పరిష్కరించేంత వరకు వారికి అండగా ఉంటామని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతి కార్యదర్శులపై సీఎం కేసీఆర్ చిన్న చూపు చూస్తున్నారని చిత్తశుద్ధి ఉంటే వెంటనే రెగ్యులరైజ్ చేసి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద కారోబార్‌లు, బిల్ కలెక్టర్లు, పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర బహుజన దళం అధ్యక్షుడు నరేశ్, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు పొన్నం తిరుపతి, మెట్‌పల్లి జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జక్కుల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి వినతి



హైకోర్టు న్యాయమూర్తి కార్తీక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

జగిత్యాల జోన్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పుల్ల కార్తీక్ శుక్రవారం జగిత్యాలకు రాగా, జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులో కేసుల వివరాలు, అదనపు కోర్టుల ఏర్పాటు గురించి చర్చించారు. ఉమ్మడి కరీంనగర్ కోర్టు పరిధిలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కోర్టు కేసులు, ఫ్యామిలీ కోర్టుకేసులు జగిత్యాల కోర్టుకు బదిలీ చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాటిపల్లి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, కోశాధికారి చంద్రమోహన్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వేతన జీవో అమలు చేయండి



మాట్లాడుతున్న సుతారి రాములు

కోరుట్ల: మున్సిపాలిటీల్లోని కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనల జీవో అమలు చేయాలని, ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు డిమాండ్ చేశారు. పట్టణంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వివిధ రంగాల్లోని కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించి, మున్సిపల్ కార్మికులను విస్మరించారని, రూ.ఒక వెయ్యి జీతం పెంచి సరిపెట్టటం సరికాదన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతన జీవో ప్రకారం ప్రతినెలా రూ.20వేల వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేవారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు బైరి కనకలక్ష్మి, సుగుణ, తెడ్డు సాయిలు, గంగారాం, చంద్ర ప్రకాశ్, రాజయ్య, రమేశ్, గంగు, కనకలక్ష్మి, ముజీబ్, అరవింద్, అంజయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ఆందోళన ఉద్రిక్తం

- అడ్డుకున్న పోలీసులు
- రెండు వర్గాల మధ్య తోపులాట
- కాషాయం శ్రేణుల అరెస్ట్

జగిత్యాలక్రైం: బీజేపీ శ్రేణులు శుక్రవారం చేపట్టిన హనుమాన్‌చాలీసా పారాయణం కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఇంటిఎదుట ఈ ప్రక్రియ చేపట్టేందుకు బీజేపీ నాయకులు బయలు దేరి వెళ్తుంగా.. సమాచారం అందుకున్న పోలీసులు.. జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లకుండా రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆందోళనకారులు జంబిగద్దె ప్రాంతం నుంచి వచ్చి బారికేడ్లను తోసేసి ముందుకు సాగారు. ఈక్రమంలో పట్టణ సీఐ రాంచందర్‌రావు, ఎస్సైలు సంజీవ్, రహీం, సందీప్ వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కొందరిని పోలీసులు అరెస్టు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జీవన్‌రెడ్డి ఇంటి ఎదుట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలీసుల అత్యుత్సాహం

జంబిగద్దె వద్ద హనుమాన్ చాలీసా పారాయణం శాంతియుతంగా చేపట్టామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, ఆ పార్టీ నాయకుల ఇంటి ఎదుట హనుమాన్ చాలీసా చేపట్టేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకుని అత్యుత్సాహం ప్రదర్శించి తమపై అక్రమంగా కేసులు నమోదు చేశారని ఆరోపించారు. బజరంగ్‌దళ్‌పై నిషేధం విధిస్తామని కాంగ్రెస్ ప్రకటించడాన్ని నిరసిస్తూ శాంతియుతంగా పారాయణం నిర్వహించామని అన్నారు. నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, శైలేందర్‌రెడ్డి, సంబారి ప్రభాకర్, సునీత, సురభి నవీన్, వీరబత్తిని అనిల్, తిరుపతి, అరుణ్, ఆముదరాజు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టులో విచారణ



తిరుపతిరెడ్డి నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో

కోరుట్ల: మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టులో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఘటనలపై ఆర్డీవో వినోద్‌కుమార్ శుక్రవారం విచారణ జరిపారు. మెట్‌పల్లి పట్టణ పరిధిలోని వెంకట్రావ్‌పేటకు చెందిన కొమిరెడ్డి తిరుపతిరెడ్డి ప్రాజెక్టులో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణంలోని కార్యాలయంలో ఆర్డీవో విచారణ జరిపారు. తిరుపతిరెడ్డితోపాటు సీడీపీవో తిరుమలాదేవి విచారణకు హాజరయ్యారు. అక్రమాలకు సంబంధించిన వివరాల గురించి తిరుపతిరెడ్డిని ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణం కన్నా తక్కువ పరిమాణం ఉన్న గుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారని, గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన పాలను బహిరంగ మార్కెట్‌కు తరలిస్తూ అమ్ముకుంటున్నారని ఆయన తెలిపారు. పాల ప్యాకెట్లు విక్రయిస్తున్న దానిపై పలుమార్లు ప్రతికల్లో ఆధారాలతో కథనాలు ప్రచురితమైనా కేవలం సిబ్బందికి మెమోలు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప.. అక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోలేదని వివరించారు. తిరుపతిరెడ్డి లేవనెత్తిన అంశాలపై సీడీపీవో నుంచి కూడా ఆర్డీవో వివరణ తీసుకున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



సుమిత్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మెట్‌పల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తెలిపిన ప్రకారం..బీహార్‌కు చెందిన సుమిత్ కుమార్ (20) కూలీపని నిమిత్తం కొంత కాలం క్రితం మెట్‌పల్లికి వచ్చాడు. అధిక సంపాదన కోసం గంజాయి విక్రయించాలని భావించాడు. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయిని తీసుకువచ్చి ఈ ప్రాంతంలో విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు వ్యవసాయ మార్కెట్ ప్రాంతంలో నిఘా పెట్టి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. 550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బొమ్మెనలో మరో ఇద్దరు..

కథలాపూర్ మండలం.. బొమ్మెన గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై శ్వేత తెలిపారు. బొమ్మెనలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో తనిఖీలు చేశామన్నారు. ఇద్దరు గంజాయి విక్రయిస్తున్నట్లు తేలడంతో పట్టుకొని వారినుంచి 170 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.